పద్యనాటక వైభవాన్ని చాటాలి : ఓలేటి పార్వతీశం


సన్మాన గ్రహీతలతో అతిథులు

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్యనాటక వైభవాన్ని నలుదిశలా చాటాలని సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో చింతామణి, భవాని శంకరుల ప్రణయసన్నివేశ దృశ్య ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పార్వతీశం మాట్లాడుతూ పద్యనాటకాలు మన సంస్కృతిని, సంప్రదాయాలను ఇతరులకు పరిచయం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా నటులు చంద్రబాబునాయుడు, చాగంటి సాయిలక్ష్మి, సాయివెంకట్, వీరబ్రహ్మం, సత్యనారాయణలను సన్మానించారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మనోఉల్లాసాన్ని కలిగించేది సంగీతం : శంకరనారాయణ

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగీతాన్ని ఆలపించడం లేదా ఆస్వాదించడం మనోఉల్లాసం కలిగిస్తుందని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. డిస్కో డిజె పాటలు హోరు శారీరక ఊగులాట కలిగిస్తే శాస్త్రీయ లలితగీతాలు మానసిక ఆరోగ్యం కోసం దోహదపడతాయన్నారు మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో కళాధరి ఆధ్వర్యంలో అలనాటి ఆణిముత్యాలు పేరిట ఘంటసాల సుశీల, జానకి భానుమతి తదితరులునాటి సినిమాల్లో పాడిన పాటలు మోహన్‌రావు, వీఏ లక్ష్మి, కృష్ణ, ప్రభాకర్, మోహన్, శకుంతల మధురంగా ఆలపించారు. శంకరనారాయణతోపాటు గాయకులు వైఆర్ శాస్త్రిలను సన్మానించారు. ఎస్‌వి రామారావు పాల్గొన్నారు. మోహన్‌రావును అభిమాని ,రాము సత్కరించారు.

కులగణనపై కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ హర్షం

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బాల్‌రాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కులగణనలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్ అన్నారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గౌడసంఘం నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర కులగణన చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీలు మధుయాష్కీగౌడ్, వి.హనుమంతరావులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, టీపీసీసీ కార్యదర్శి బండి సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్


తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని జమ్ జమ్ మసీదు వీధిలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, కాంట్రాక్టర్ మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్ పెండింగ్ పనులు పూర్తి చేయండి


జలమండలి ఎండీకి సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ మున్సిపల్ డివిజన్‌లో వాటర్‌వర్క్స్ సమస్యలు పరిష్కరించి, పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో ఆయన కార్యాలయంలో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా డివిజన్‌లోని చిక్కడపల్లి పలు వీధుల్లో, బస్తీల్లో కలుషిత నీరు సరఫరా వల్ల ప్రజలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై తాము ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే కలుషితనీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న నూతన తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని కోరారు. నూతన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎండీని కార్పొరేటర్ కోరారు. ఎండీ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు


భోలక్‌పూర్ బడీమసీద్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గౌసుద్దీన్

ముషీరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గౌసుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని బడీమసీద్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులను సంబంధిత శాఖ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైన చోట కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లోఓల్టేజ్ సమస్య పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అజీజ్ ఉల్లా ఉస్మాని, ముక్రం, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


డ్రగ్స్‌పై అవేర్‌నెస్ కార్యక్రమంలో డీఎస్పీ భిక్షపతిరావు

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రైల్వే యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ పి.భిక్షపతిరావు సూచించారు. మంగళవారం కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఆర్.ఎల్లప్ప ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వేస్టేషన్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత సన్మార్గంలో నడిచి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీజీ యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ సీఐ సామ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

● స్వల్ప గాయాలతో బయటపడ్డ నలుగురు


బోల్తా పడిన కారు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగర శివారు నాగోల్ నుంచి గౌరెల్లి రేడియల్ రోడ్డులో వెళ్తున్న కారు కుంట్లూర్ పరిధిలోని జీవీఆర్‌కాలనీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో అందులోని వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేయాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసీటీజేఎంయూ నేతల వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హనుమంతుముదిరాజ్ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలు అమలు చేయాలని ఆర్టీసీటీజేఎంయూ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.హనుమంతుముదిరాజ్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతుముదిరాజ్ మాట్లాడుతూ 2013 సంవత్సరానికి సంబంధించి తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు చాలా మందికి బాండ్ డబ్బులు ఇచ్చారని, ఇంకా ఇవ్వని వారికి వెంటనే ఇవ్వాలని మంత్రిని, డిప్యూటీసీఎంలను కోరామని తెలిపారు. టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్‌లను అనుమతిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టించారని అవి నెరవేర్చకపోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు నిరాశకు, అసహనానికి గురవుతున్నారని వివరించారు. ఈ విషయంలో చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని, మేనిఫెస్టోలోపెట్టిన అంశాలు అమలు చేయాలని మంత్రులను ఆయన కోరారు. ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి పొన్నం హామీనిచ్చారని తెలిపారు. కాగా, ఆర్టీసీలో బ్రీత్ అనలైజర్ పేరుతో సస్పెండ్, రిమూవ్ అయినవారికి ఉద్యోగాలు ఇవ్వాలని మంత్రిని కోరినట్లు హనుమంతుముదిరాజ్ తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో టీజీఎస్‌ఆర్‌టీసీ టీజేఎంయూ నాయకులు బుల్లెట్ పాండు, ఎర్రగడ్డపల్లి కృష్ణ, సాలాది శ్రీనివాస్, ఎగుప్తా, గనెమోని శ్రీను తదితరులు ఉన్నారు.

తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునికీకరణకు చర్యలు

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్


డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ అరవింద్‌నగర్ కాలనీలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునీకరణ తరువాతే సీసీరోడ్లు, వీడీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠాజైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, బీజేపీ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, వివిధ పార్టీల నేతలు పరిమల్‌కుమార్, వి.శ్రీనివాస్‌యాదవ్, ఆర్.రాంచందర్, సలంద్రి దిలీప్‌యాదవ్. లింగంగౌడ్, గద్దె శ్రీను. లడ్డుతో పాటు నాయకులు, కార్యకర్తలు, అరవింద్‌నగర్ కాలనీవాసులు మహిళలు పాల్గొన్నారు.

యువశక్తికి సానపెడితే ఉన్నతంగా ఎదుగుతారు


సదస్సులో మాట్లాడుతున్న పద్మకమలాకర్

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువతకు సానపెడితే ఉన్నతంగా ఎదుగుతారని నవభారత్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మకమలాకర్ అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలామ్ జయంతి సందర్భంగా అశోక్‌నగర్‌లోని డా. హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో నవభారత్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 'యువత సవాళ్ళు' అనే అంశంపై ఉచిత సదస్సు మంగళవారం జరిగింది. ఈసందర్భంగా పద్మకమలాకర్ మాట్లాడుతూ యువత వజ్రంలాంటివారన్నారు. సమాజంలో మార్పు తేవడంతో పాటు భవిష్యత్ పటిష్టతను ఏర్పాటు చేయడంలో యువత కీలకపాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు జి.కృష్ణవేణి, పి.స్వరూపరాణి, కె.శోభారాణి, తెలంగాణ ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్ఫూర్తి అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పినాకిని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా స్ఫూర్తి అవార్డుల ప్రదానసభ ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని నల్లతీగ శ్రీనివాసాచార్యులు, నాయకంటి నరసింహశర్మ, గజవెల్లి సత్యనారాయణ, ఎన్.విజయశ్రీ, నరసింహులుగౌడ్, వేమూరి అనంతరామకృష్ణశర్మ, వేమూరి మంజుల, కుమారస్వామి, మాదురిలకు పురస్కారాలను ప్రదానం చేశారు. మధుసూదనాచారి మాట్లాడుతూ కలాం జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. నిర్వాహకులు మురళీమోహన్‌రాజు, వివి మహేశ్వరరావు, రామచంద్రరావు, అరుణజ్యోతి, రాధాకుసుమ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

నల్లకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబంలో పుట్టి శాస్త్రవేత్తగా ఎదిగి, భారత రాష్ట్రపతి పదవిని సమర్థవంతంగా నిర్వహించిన డాక్టర్ ఏ.పీ.జే.అబ్దుల్ కలాం జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్ సూచించారు. మంగళవారం నల్లకుంట డివిజన్ శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి, నాయకులు సీహెచ్ మురళీకృష్ణ, కేపీ మురళీకృష్ణ, మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి, విశ్వం, శరత్, శ్రీనివాస్‌యాదవ్, ఈశ్వర్, ఎ.నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలాం జీవితాన్ని చదివితే.. లక్ష్యసాధనకు దోహదం


చిక్కడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కలాం జీవితం చదివితే లక్ష్యసాధనకు ఉపయోగపడుతుందని కమర్షియల్ టాక్సెస్ మాజీ అదనపు కమిషనర్ వై.సత్యనారాయణ అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీలో నిర్వహించిన సదస్సులో పోటీపరీక్షల అభ్యర్థులనుద్దేశించి సత్యనారాయణ మాట్లాడారు. మనజీవితం ఉన్నతంగా ఒక లక్ష్యంవైపు వెళ్ళాలంటే కలాం మాటలు 'కలలు కనండి ఆ కలల సాకారానికి కృషిచేయండి' అనేవి యువత గుర్తుపెట్టుకోవాలన్నారు. అకాడమీ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, ఏట సతీష్‌కుమార్, మురళీకృష్ణ, సంధ్యారాణి, శివలీల, నవనీత, దివ్య, మౌనిక, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


బాపూజీ నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జన ఊరేగింపునకు ముందు అమ్మవారి పూజలో పాల్గొన్న ముషీరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్ తదితరులు


భరత్‌నగర్‌లో దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు తదితరులు
- ముషీరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

స్థానికసంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర


రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో 'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపేంద్ర, న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపి స్థానికసంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరీ గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' అనే పుస్తకాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో అధికారంలోకి వస్తే కులగణన జరిపి బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే సమగ్ర కులగణన జరిపి బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది సదానందం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్యాయం జరుగుతూ వస్తున్నదన్నారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి దేవరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇక జాప్యం చేయకుండా వెంటనే బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భిక్షమయ్య, అంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు కళ్యాణ్, కృష్ణాగౌడ్, పాండు, సత్యనారాయణరెడ్డి, జయప్రసాద్, కిషన్, రమేష్‌యాదవ్, వెంకటకృష్ణ, శివకుమార్‌గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రెండో అంతస్తు పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ రెండో అంతస్తు భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న ఫౌజీయా బేగం(35) మొదటి భర్తకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకుంది. అతతడితో కూడా గొడవలు జరగడంతో విడాకులు ఇచ్చి ఇంటి వద్దనే ఉంటుంది. కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఫౌజీయాబేగం జీవితంపై విరక్తి చెందిన ఫౌజీయాబేగం మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో తాను నివాసం ఉంటున్న రెండు అంతస్తుల భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు మహ్మద్ షకీల్ కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికిచేరుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్‌ఐ తెలిపారు.

కాచిగూడలో బాలిక అదృశ్యం

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక అదృశ్యమైంది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న వామన్ దేవకాంత్ కుమార్తె ప్రియ(17) కోఠిలోని ఓ గోల్డ్ షాపులో ఉద్యోగం చేస్తుంది. ఈనెల 14న ఇంటి నుంచి గోల్డ్ షాపుకు వెళ్లిన ప్రియ తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు గోల్డ్ షాపు యజమానికి ఫోన్ చేయగా ఉద్యోగానికి రాలేదని చెప్పాడు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి మంగళవారం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్‌ఐ తెలిపారు.

కిషన్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు



బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎడెల్లి అజయ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి, డివిజన్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, డివిజన్ ఓబీసీ మోర్చా నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.
- గోల్నాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

మంత్రులు రాజనర్సింహ, పొన్నంకు..



మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం గాంధీ ఆస్పత్రిలో సంతాన సాఫల కేంద్ర ప్రారంభోత్సవానికి హాజరైన సందర్భంగా ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ బి.బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ తదితరులు వారిని కలిసి దసరా శుభాకాంక్షలు చెప్పి, సన్మానించారు.
-ముషీరాబాద్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు..



ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్ మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సదా, కృష్ణమూర్తి ఉన్నారు.
-ముషీరాబాద్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిగా శంకర్‌ముదిరాజ్


శంకర్‌ముదిరాజ్

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా టి.శంకర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మంగళవారం ప్రకటించారు. శంకర్ ముదిరాజ్ గతంలో తెలుగుదేశం పార్టీలో రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత కొంత కాలం క్రితం ఎమ్మెల్యే గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే గోపాల్ ముఖ్య అనుచరుడిగా కొనసాగుతూ వస్తున్నారు. ఈ సందర్భంగా టి.శంకర్ ముదిరాజ్ రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ అధిష్టానం ఇచ్చే కార్యక్రమాలను డివిజన్‌లో విజయవంతంగా నిర్వహిస్తానని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడతామని ఆయన తెలిపారు. డివిజన్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో రాంనగర్ డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి'

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేవైఎం రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్ కన్నెబోయిన రాముయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5,500 కోట్ల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పెండింగ్ బకాయిలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో గుడిలో రాళ్లు విసిరాడు

అంబర్‌పేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి 11గంటల సమయంలో గుడి తలుపులు తెరవనందుకు మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి గుడిలో రాళ్లు వేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అశోక్ తెలిపిన ప్రకారం. బాగ్ అంబర్‌పేట దోబీగల్లీలో నివాసం ఉండే మహేష్ రాత్రి 11గంటల సమయంలో మద్యం తాగి అంబర్‌పేట మహాకాళి అమ్మవారి ఆలయానికి వచ్చాడు. గుడి తలుపులు తెరవమని సెక్యూరిటీగార్డును కోరాడు. సెక్యూరిటీగార్డు గుడి తలుపులు తెరవలేదు, దీంతో మహేష్ అక్కడే ఉన్న కొన్ని రాళ్లను తీసుకుని గుడిలో వేశాడు, విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు వెంటనే గుడివద్దకు వచ్చి అతన్ని అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ మౌనిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.